
బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## విజేతలకు బహుమతులు ప్రదానం

వడ్డేపల్లి, ఏప్రిల్ 13 : మండలంలోని కొంకల గ్రామంలో నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన నృత్య పోటీలను ఎమ్మెల్యే విజయుడు, వైస్ ఎంపీపీ చంద్ర శేఖర్ గౌడ్, నాయకులు మధుసూదన్ రెడ్డి, అజయ్‌కుమార్, ధర్మ హాజరై తిలకించారు. విజేతలకు ఎమ్మెల్యే విజయుడు, నిర్వాహకులు పట్టు చీరలను అందజేశారు. అనంతరం దాతలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వడ్డె వరదరాజులు, వడ్డె సంజీవ, వేణు రెడ్డి, పైపాడు కొండలు, బడేసబ్, అక్బర్ బాబు, కృష్ణ, ఆంజనేయులు, శేఖర్, గోకారి పాల్గొన్నారు.

### బండలాగుడు పోటీలు ప్రారంభం

జాతర సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను ఆదివారం రాఘవేంద్ర రెడ్డి ప్రారంభించారు. ఆరు జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా విజేతలకు మొదటి బహుమతిగా రూ.50వేలు పల్కందొడ్డి ఖాజా హుసేన్‌కు, రెండో బహుమతి రూ.40 వేలు పెద్దదగడ గోపాలకృష్ణకు, మూడో బహుమతి రూ.30వేలు సింగవరం హర్షిణి బుల్స్, బండపల్లి గోపాల్‌కు, నాలుగో బహుమతి రూ.20వేలు సిసన గుంట్ల మోహన్‌రెడ్డికి, ఐదో బహుమతి రూ.10వేలు వల్లూరు తిరుమలేశ్‌కు, ఆరో బహుమతి రూ.5వేలు జయపాల్ నాయుడుకు నిర్వాహకులు, దాతలు అందజేశారు. కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, యోగిరెడ్డి, నాగరాజు, సూరి బాబు, శరవన్న, భాస్కర్ గౌడ్, చిన్న తిమ్మప్ప, గ్రామపెద్దలు యువకులు పాల్గొన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం


కానాయపల్లిలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

కొత్త కోట, ఏప్రిల్13 : కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బాజ గిరన్న వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ అంబలి కేంద్రాన్ని కొత్త కానాయపల్లి సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రానికి నిత్యం వెళ్తున్న వాహనదారులు, పాదచారుల కోసం ఈ అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం మాజీ ఎంపీ రావులను మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్ శాలువాతో సన్మానించారు.

### గ్రామ దేవతలు మన సంస్కృతికి చిహ్నాలు

గోపాల్‌పేట, ఏప్రిల్ 13 : గ్రామ దేవతలు మన సాంప్రదాయ, సంస్కృతికి చిహ్నాలుగా నిలుస్తాయని మాజీ ఎంపీ రావుల చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. ఏదుల మండలంలోని చెన్నారంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం చౌడేశ్వరీ దేవత విగ్రహ ప్రతిష్ఠోత్సవం నిర్వహించగా రావుల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, గ్రామస్తులు ఆశన్న, బాబు, చిన్నయ్య, శ్రీశైలం, సంజీవయ్య, మల్లయ్య ఉన్నారు.

## ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ముగింపు వేడుకలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 13 : వనపర్తి మండలం చందాపూర్‌లో వారం రోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కో-ఎడ్యుకేషన్ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ స్పెషల్ క్యాంప్ ముగింపు వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ వేడుకలకు రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఎన్‌ఎస్‌ఎస్‌పై ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సమ్మర్ స్పెషల్ క్యాంపు యూనిట్ 3,4 పాల్గొన్నాయని చెప్పారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, నేటికి ప్రభుత్వ బడుల్లోనే ప్రామాణిక విద్య ఉందని, వచ్చిన అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే మంచి చెడులను గుర్తించేస్థాయిలో గురువులు ఉన్నారని వారిని ఎప్పటికీ మరిచి పోవద్దని, వారితో గౌరవంగా మెలగాలన్నారు. ప్రతి గ్రామానికి యూత్ పాత్ర ఎంతో కీలకమన్నారు. పాజిటివ్‌గా ఆలోచించి మంచి సమాజ నిర్మాణానికి అడుగులు వేయాలన్నారు. అదేవిధంగా హెచ్‌ఎం శంకరయ్య మాట్లాడుతూ మంచి మనిషిగా ఎదగడానికి ఎన్‌ఎస్‌ఎస్ అవసరమని, వలంటీర్లలో నైపుణ్యత, సేవా భావాన్ని పెంపొందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ సేవా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ధాంసింగ్, సహాయ ప్రోగ్రాం అధికారి వెంకటస్వామి, గణేశ్, అధ్యాపకులు యాదగిరి గౌడ్, రంజిత్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

పెబ్బేరు, ఏప్రిల్ 13 : శ్రీరంగాపురంలో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. స్థానిక కుమ్మరి గేరిలో రూ. 10లక్షల సీఆర్ఆర్ నిధులతో చేపట్టనున్న పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పాన్‌గల్, ఏప్రిల్ 13: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని అన్నారంగ్రామ సమీపంలోని చోటు చేసుకున్నది. గ్రామస్తులు కథనం ప్రకారం..నాగవరం గ్రామానికి చెందిన దేవేందర్ పాన్‌గల్ మండంలోని బండపల్లి గ్రామంలో కోళ్ల షెడ్ నడుపుతున్నారు. స్వామి అనే ఆర్‌ఎంపీ పాన్‌గల్‌లో క్లినిక్ నడుపుతున్నారు. దేవేందర్ బైక్‌పై స్వగ్రామంనుంచి బండపల్లికి వస్తుండగా, ఆర్‌ఎంపీ పాన్‌గల్ నుంచి వనపర్తికి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ఆర్‌ఎంపీ స్వామికి కాలు విరగగా, దేవేందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం వారిద్దరిని అంబులెన్స్‌లో జిల్లా ఏరియా దవాఖానకు తరలించారు.

## ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 13: జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్యలు మాట్లాడుతూ అధ్యాయనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా భావిస్తూ ఉపాధ్యాయుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, సంఘ అభివృద్ధి, పటిష్టత కోసం ఎంతో అమరుల త్యాగాలు అర్పించాలని వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామన్‌గౌడ్, చిరంజీవి, మురళీ, లక్ష్మణ్‌నాయక్, రాధాకృష్ణ, అయోధ్య, రాములు, సూరయ్య, కృష్ణ, సురేశ్, గంగన్న, డి.రాము, డి.కృష్ణ, సాయిబాబు, మధు ఉన్నారు.

# నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

- గాలికి వదిలేసిన ప్రభుత్వం
- ముళ్లకంపలతో దర్శనమిస్తున్న ఆట స్థలాలు
- క్రీడలు ఆడేందుకు ఇబ్బంది అంటున్న క్రీడాకారులు

అయిజ రూరల్ , ఏప్రిల్ 13 : గ్రామీణ, పట్టణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో బీఆర్‌ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ప్రతి గ్రామ పంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో క్రీడాకారులు క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడి ఎంతో నైపుణ్యం పొందారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ స్థలాలు, ఖాళీ ప్రదేశాలు, పాఠశాలల మైదానాలు, గ్రామ శివారులో ఉన్న స్థలాలను గుర్తించి వాటిని క్రీడా ప్రాంగణాలుగా మార్చింది. ఇప్పుడు పాలిత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో ఉన్న క్రీడా ప్రాంగణాలను పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. దీంతో క్రీడా ప్రాంగణాలు ముళ్ల కంపలతో దర్శనమిస్తున్నాయి.

### 255 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు

బీఆర్‌ఎస్ హయాంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉన్న మొత్తం 255గ్రామపంచాయతీల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. పాలిత కాంగ్రెస్ ప్రభుత్వం అవేవి పట్టించుకోకపోవడంతో క్రీడాకారులు క్రీడలు ఆడేందుకు అనువుగా లేక పోవడంతో క్రీడాకారుల పాలిట శాపంగా మారాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడంతో ముళ్ల కంపలు పెరిగి నిర్జన ప్రదేశంగా మారాయి. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పాలన లేక పోవడంతో క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే నాథుడే లేడని క్రీడాకారులు వాపోతున్నారు. సమాజంలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని క్రీడలతో మానసికోల్లాసం కలిగి ఆరోగ్యవంతమైన జీవితం గడపడం సాధ్యపడుతుందని క్రీడాభిమానులు అంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గద్వాల జిల్లాలో సుమారు రెండుకోట్ల వ్యయంతో 255 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోపోవడంతో ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టి కేంద్రీకరించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకొని క్రీడా ప్రాంగణాల్లో ఉన్న ముళ్ల కంపలను తొలగించి క్రీడలు ఆడుందుకు అనువుగా మార్చాలని క్రీడాకారులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో వృథాగా మారిన క్రీడాప్రాంగణం


క్రీడా ప్రాంగణంలో నిర్మాణరంగానికి సంబంధించిన కంకర, డస్టు నిల్వ చేసిన దృశ్యం

### ప్రాంగణాలను పరిశీలిస్తాం

జిల్లా ఉన్న క్రీడా ప్రాంగణాలను పరిశీలిస్తాం. ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు ఉన్న ప్రాంగణాలను పర్యవేక్షణ చేసి క్రీడలు అడేందుకు అనువుగా మారుస్తాం.

-నర్సింగరావు, అదనపు కలెక్టర్ , గద్వాల

### ముళ్ల పొదలు తొలగించాలి



క్రీడా ప్రాంగణాలలో ముళ్లపొదలను తొలగించి క్రీడలు ఆడేందుకు అనువుగా మార్చాలి. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని నిపుణులు చెబుతున్న పాలిత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను శుభ్రం చేయడం లేదు. ఇలా అయితే ఆటలు ఎలా ఆడుకోవాలి.

– కుమ్మరి మల్లి , క్రీడాకారుడు, సంకాపురం

### క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించాలి



క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. ఇటీవల ప్రాంగణాల నిర్వహణపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకరించకపోవడంతో పలు చోట్ల పిచ్చి మొక్కలతో దర్శన మిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాల నిర్వహణపై పర్యవేక్షణ ఉండేదని ప్రస్తుతం ఆపరిస్థితి కనిపించడం లేదు.

–రామ్‌చరణ్ , క్రీడాకారుడు , పెంచికలపాడు

### హమాలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

గద్వాల అర్బన్,ఏప్రిల్ 13 : అడ్డా మీద పనిచేసే హమాలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు అన్ని రకాల వస్తు సేవలను సరఫరా చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు అందుబాటులో ఉన్న హమాలీలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఉప్పేర్ నర్సింహ, రంగన్న, బాలకృష్ణ, ఆంజనేయులు ఉన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్త కోట, ఏప్రిల్13 : కొత్తకోట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కొత్తకోట పట్టణానికి చెందిన ఆనంద్ జ్యూవెల్లర్స్ వారు మదన్‌కుమార్ జ్ఞాపకార్థం నారాయణ్ దాస్ లీల నారాయణ్ దాస్ ఆనంద్ దంపతులు, వారి కుమారులు నారాయణ్ దాస్ సుదీష్ణ అరుణ్ దంపతులు రూ.2,51,116ల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తం విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి గురుస్వాములు గజ్జల శ్యామ్ సుందర్ గౌడ్, కన్నారెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి వారి చేతుల మీదుగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు విశ్వనాథం గంగాధర్, బలిజ లింగేశ్వర్, సత్యం సాగర్, లక్ష్మీనారాయణ, వేముల సంతోష్, కృష్ణయ్య చారి, భీమ కిశోర్‌కు అందజేశారు.

### పదో వార్డులో బోరు మోటర్ ఏర్పాటు

అమరచింత, ఏప్రిల్ 13: ఆత్మకూర్ పట్టణంలోని పదో వార్డులో ప్రజలకు మంచినీరు సరఫరా చేసే బోరు మోటర్ రెండు రోజుల కిందట మరమ్మతులకు గురికావడంతో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేసిన ఇబ్బందులు పడ్డారని మున్సిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోరు మోటర్‌ను మరమ్మతులు చేయించి పదో వార్డులో యథావిధిగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలనీలో మంచినీటి సమస్య రాకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మందకృష్ణకు ఆహ్వానం

అమరచింత, ఏప్రిల్ 13: ఈనెల 23వ తేదీన ఆత్మకూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తోపాటు తెలంగాణ కళాకారుడు ఏపూరి సోమన్నకు ఆహ్వాన పత్రికను అందజేసినట్లుగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అజ్జపాగ లక్ష్మణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జానకిరాములు, దళిత సంఘం నాయకుడు బాలమణ్యం తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ప్రముఖులతో ఆవిష్కరణ చేయిస్తామని తెలిపారు.

### నిరంతరం హరిహర సంకీర్తనలు నిర్వహించాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 13: తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే హరిహర సంకీర్తలను యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ ఆలయంలో నిరంతరం నిర్వహించాలని భజన మండలి సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మే 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద విజయ శంకరస్వామి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాదగిరి గుట్ట లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో హరినామ సంకీర్తనలు, భజనలు నిరంతరం జరిగేలా, ఏ గుడికి వెళ్లినా ఉచిత దర్శనం, ప్రసాదం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, భజనపరులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు మే 7న ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున భజన భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు రాములు, నాగేశ్‌యాదవ్, వెంకటరాములు, చిన్నారెడ్డి, బాల్‌రెడ్డి, రమణాచారి, కుర్మయ్య, శ్రీశైలం, సురేశ్, మాధవ రెడ్డి, శ్రీను, వెంకటయ్య, శంకరయ్య, హన్మంతురెడ్డి, మోహన్, భరత సింహ ఉన్నారు.

## బడుగుల బాంధవుడు బీపీ మండల్


బీపీ మండల్ యాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహనీయుల స్ఫూర్తి వేదిక నేతలు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 13 : బడుగుల బాంధవుడు బీపీ మండల్ అని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాంప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీసీ రిజర్వేషన్ల సాధకుడు , జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ యాదవ్ (బిందేశ్వర్ ప్రసాద్ మండల్) వర్ధంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారాంప్రకాశ్ మాట్లాడుతూ బీపీ మండల్ బీహార్ రాష్ట్రంలోని బనారస్ ప్రాంతంలో ఒక సంపన్న యాదవ కులంలో జన్మించాడు. 25వ యేటనే జిల్లా కౌన్సిల్‌కి ఎన్నికై జ్యుడిషయల్ మెజిస్ట్రేట్‌గా పనిచేశారని, కాంగ్రెస్ పార్టీ తరపున 1952 సంవత్సరంలో మొదటిసారిగా రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యాడని గుర్తుచేశారు. భారత రాజ్యాంగ నిర్మాణం తర్వాత భారత సామాజిక రాజకీయ రగిలించి వేసిన ఘనత బీపీ మండల్‌కి దక్కిందని, రాజకీయాల్లో ఉద్యోగ, విద్య తదితర రంగాల్లో ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కోసం సాగించిన కృషి చారిత్రాత్మకంగా నిలిచిపోయిందన్నారు. దళిత బహుజనులు అందరూ రాజ్యాధికారం కోసం పోరాటాలు కొనసాగించాలని అందుకయ్యే విద్యను చదువుకోవాలని అప్పుడే సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మహనీయుల స్ఫూర్తి వేదిక నేతలు బూరోజు గిరిరాజాచారి, బాలేమియా, గంధం గట్టయ్య, భోజరాజు, గద్వాల కృష్ణ, గంధం నాగరాజు, తగవుల వెంకటస్వామి, నర్సింహ, వడ్డెమాన్ రాములు, వెంకటస్వామి, కురుమూర్తి, విజయ్‌కుమార్, కోట్ల మధుసూదన్‌రావు, బండలయ్య పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం


రక్తదానం చేస్తున్న మాల మహానాడు ప్రతినిధులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 13 : డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జనరల్ దవాఖానలో ఆదివారం జైభీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ, మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ రక్తదాన శిబిరానికి సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్‌హాజరై మాల మహానాడు ప్రతినిధులు బండారు శ్రీనివాసులు తదితరులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని వివరించారు. అదేవిధంగా కవి జన జ్వాల మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణాపాయంలో ఉన్న మరో మనిషి జన్మనిచ్చినంత గొప్పసాయం అని అన్నారు. రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆవుల కురుమూర్తి మాట్లాడుతూ మహనీయుని బాటలో మనమందరం ప్రయాణించాలని అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చడంలో ప్రతి ఒక్కరరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పావనం చంద్రశేఖర్, కంటే నిరంజన్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, గంధం నాగరాజు, రాధాకృష్ణ, బైరోజు చంద్రశేఖర్, వెంకటస్వామి, రాంబాబు, అంజయ్య పాల్గొన్నారు.

## అ'పూర్వ' కలయిక

గట్టు, ఏప్రిల్ 13 : 13 ఏండ్ల తర్వాత పదో తరగతి విద్యార్థులు కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. 2011-12 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు స్థానిక జెడ్పీహైస్కూల్‌లో 'గెట్ టు గెట్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటుచేసి తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులతోపాటు తమ సాధకబాధకాలను వేదికపై పంచుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎన్ఐ మేరమ్మ, ఖాజా, వెంకటేశ్వర్లు గౌడ్, నరేశ్, రియాజ్, రామచంద్రయ్య, సంజన, ఎస్తేర్‌రాణి, సుహాసిని, లక్ష్మీప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


గట్టులో పూర్వ విద్యార్థులు

### పాన్‌గల్ మండల కేంద్రంలో..


పాన్‌గల్‌లో 2004-05 విద్యాసంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు

పాన్‌గల్, ఏప్రిల్ 13 : మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఒకరినొకరు పరిచయం చేసుకొని విద్యాదశలో చోటుచేసుకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, రాంరెడ్డి, సుధీర్ రెడ్డి ఎండి.గౌస్, విజయకుమార్, పదోతరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కేతేపల్లి గ్రామవాసికి డాక్టరేట్ పట్టా


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న నవీన్‌కుమార్

పాన్‌గల్, ఏప్రిల్13: పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన జంగం రాచయ్య, నాగేశ్వరమ్మ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. కామర్స్ ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్టర్ పర్యవేక్షణలో భారతదేశంలో చిన్న విత్త బ్యాంకుల ద్వారా ఆర్థిక చేరిక అనే అంశంపై అధ్యయనం చేశారు. చిన్నతనంలో తండ్రిని కోల్పోయిన నవీన్‌కుమార్ పదోతరగతి వరకు కేతేపల్లి ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వనపర్తిలో, డిగ్రీ ప్రభుత్వ పురుషుల కాలేజీ వనపర్తిలో పూర్తి చేశారు. అదేవిధంగా ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసి, అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన నవీన్ కుమార్‌ను గ్రామ పెద్దలు, తోటి మిత్రులు అభినందించారు.

### యువ వికాసానికి నేడే ఆఖరి గడువు

మల్దకల్, ఏప్రిల్ 13 : నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ప్రకటించి రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులకు నేడే ఆఖరు గడువు అని ఎంపీడీవో ఆంజనేయరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండగా, ప్రభుత్వం మరో తొమ్మిది రోజుల గడువు పెంచిందన్నారు. దరఖాస్తుదారులు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ తిరుపతి రెడ్డికి దరఖాస్తులను సాయంత్రంలోగా అందజేయాలని తెలిపారు.

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మహేశ్



మహేశ్‌కుమార్

పెబ్బేరు, ఏప్రిల్ 13: పెబ్బేరు మున్సిపాలిటీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించారు. పోటా పోటీగా జరిగిన ఎన్నికల్లో సభ్యులు ఓటింగ్ ద్వారా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఆరుగురు అభ్యర్థులు పోటీపడగా దేవరశెట్టి మహేశ్‌కుమార్ 182ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 645ఓట్లకు గానూ 494ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ఈ ఎన్నికల ప్రక్రియ జిల్లా ఆర్యవైశ్య సంఘం బాధ్యులు బాదం వెంకటేశ్, బుస్స రమేశ్, సింగయ్య శెట్టిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

### ర్యాలీ విజయవంతం చేయాలి

రాజోళి, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలో సోమవారం బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీలో మండల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాజోళి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి ర్యాలీ ప్రారంభమై బస్టాండ్ అవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని సభ ఏర్పాటు చేస్తున్నట్లు యువజన నాయకులు తెలిపారు

### జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 13 : కేంద్ర ప్రభుత్వ కార్పొరేటర్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా మే 20న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతుల జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసిన కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును బలవంతంగా అణచివేస్తుందని, నిరసన తెలిపే పౌరుల రాజ్యాంగ హక్కు ప్రజాస్వామ్య సమాజానికి పునాది రాయి అని, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ ప్రకారం ఎంఎస్‌పీ, కనీస మద్దతు ధరలు నిర్ణయించి కొనుగోలు గ్యారెంటీ చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేసి, రుణ విమోచన చట్టం చేయాలని, పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా సవరించాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పదేండ్లలో మోదీ ప్రభుత్వం రూ.16లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందని, కానీ రైతు రుణాలను మాఫీ చేయడం లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు, పోలీసు అణచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్ బంద్‌లో రైతు సంఘాలతో పాటు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.డీ జబ్బార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వరాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు జీఎస్ గోపి, మహబూబ్‌పాషా, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.కృష్ణయ్య, భాస్కర్, రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు జములమ్మ, ఖాజా హుస్సేన్, ఈశ్వర్, రాముడు, శ్రీనివాసులు, తిరుపతయ్య, వెంకటయ్య, రాజు, వెంకట్, స్వామి ఉన్నారు.